

అనుమతులు లేకుంటే కేసులు : ఎస్సై

రాజంపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని గ్రామాలలో అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై పుష్పరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టపాకాయాల విక్రయాలకు డీఎస్పీ అనువని తప్పనిసరిగా తీసుకోవాలని, అంతేకాకుండా అనుమతులు తీసుకున్నవారు జన సంచారం లేనిచోట టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. అందేవిధంగా టపాకాయల దుకాణాల వద్ద నీరు, ఇసుక, యాంటిఫైర్ ఎక్విప్‌మెంట్‌లాంటివి ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై పేర్కొన్నారు.



కులగణనకు.. కసరత్తు

- జిల్లాలో వచ్చేనెల నుంచి ప్రారంభం కానున్న సర్వే
- 150 కుటుంబాలకు ఒక ఎమ్యూనేటర్
- 1500 మంది ఎమ్యూనేటర్‌ల నియామకానికి అవకాశం
- ప్రభుత్వ శాఖలో పనిచేసే సిబ్బంది వివరాల సేకరణ
- స్థానిక ఎన్నికల రిజర్వేషన్లపై అభిప్రాయ సేకరణ
- 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 9.74 లక్షల మంది జనాభా



కామారెడ్డి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక ఎన్నికలతో పాటు రాష్ట్ర అభివృద్ధి,నూతన పథకాలకు ఉపయోగకరంగా మారే సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ కులగణన సర్వేకు సంబంధించి కసరత్తు పూర్తి చేశారు. ఇక ఇంటింటా సర్వే కార్యక్రమం ప్రారంభించే దిశగా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా సర్వేకు సంబంధించిన ఎమ్యూనేటర్‌లు, ప్లానిం గ్‌ను సిద్ధం చేశారు. జిల్లాలో బ్లాక్‌లుగా ఏర్పాటుచేసి దాని ద్వారా 150 కుటుంబాలకు ఒక ఎమ్యూనేటర్‌ను ఏర్పాటుచేసి సర్వే చేయనున్నారు.ఇందుకోసం జిల్లాలోని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న ఉద్యోగుల వివరాలను సేకరించారు. సర్వే కోసం సుమారు 1500ల మంది ఎమ్యూనేటర్‌లను ఉపయోగించనున్నట్లు తెలుస్తుంది. గత ప్రభుత్వ హాయంలో 2014లో సమగ్ర సర్వే చేసిన కులగణనకు సంబంధించి వివరాలను వెల్లడించలేదు. ప్రస్తుతం రానున్న స్థానిక సంస్థల్లో బీసీ,ఎస్సీ,ఎస్టీ, జనరల్ రిజర్వేషన్ల ఖరారు కోసం కులగణన ఉపయోగపడనుంది. కులగణనపై అన్ని రాజకీయ పక్షాలు, ప్రజల్లో ఆసక్తి ఏర్పడింది.

వచ్చేనెలలో సర్వే ప్రారంభం

నవంబరు మొదటి వారం నుంచి కులగణన సర్వే చేపట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతుంది. ఇందుకై సంబంధించి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం జిల్లా నుంచి సీపీఓతో పాటు మరికొంతమంది ప్రణాళిక సంఘానికి సంబంధించిన వారు శిక్షణ పొందనున్నారు. కులగణన,జిల్లా ప్రణాళిక సంఘం పర్యవేక్షణలోనే సాగనుంది. రెండు నెలల పాటు పకడ్బందిగా ఈ కులగణన సర్వే నిర్వహించనున్నారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి,బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 25 మండలాల్లో 530 గ్రామపంచాయతీలు ఉండగా 3 మున్సిపాలిటీలు ఉన్నాయి. 2011 జనభా లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం జనాభా 9,47,227 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 4,74,192 మంది ఉండగా మహిళల జనాభా 4,95,035 ఉన్నారు. ఎస్టీ జనాభా 81,956,ఎస్సీ జనాభా 1,53,678 ఉంది.

ఎమ్యూనేటర్‌ల వివరాల సేకరణ


కులగణన సర్వే నిర్వహించేందుకు ఎమ్యూనేటర్‌ల నియమించనున్నారు.ఈ సర్వేలో ప్రతీ కుటుంబానికి సంబంధించి కులం,ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితి గతులు, విద్య, ఉద్యోగం తదితర అంశాలను సేకరించనున్నారు. ప్రభుత్వం పథకాలతో ఏ విధంగా లబ్ధిపొందుతున్నారనే వివరాలు సైతం తెలుసుకోనున్నారు. వీటిని క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారిగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీ, ఎస్సీలలోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపరుచనున్నారు.

దీని ద్వారానే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లు, బీసీకోటాను నిర్ధారించనున్నారు.కులగణనకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. కులగణన చేసేందుకు 150 కుటుంబాలకు ఒక ఎమ్యునరేటర్‌ను నియమించి సర్వే చేపట్టనున్నారు. ఎమ్యునేటర్‌ల ఎంపికకై జిల్లాలోని ఉద్యోగ వివరాలను సేకరిస్తారు. సుమారు 1500ల మంది ఎమ్యునరేటర్‌లను ఉపయోగించనున్నారు.

54 ప్రశ్నలతో ప్రత్యేక ప్రొఫార్మా

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేను చేపట్టిందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రొఫార్మను ఏర్పాటుచేసింది. ప్రశ్నవళిని ఇటీవల మంత్రివర్గసంఘం ఆమెదించింది. సర్వేకు సంబంధించిన పూర్తి మార్గనిర్దేశాలను త్వరలోనే వెల్లడించనుంది. ప్రతి ఇంటికి వెళ్లి నిర్వహించే సర్వేలో ఏడు పేజీలతో 54 ప్రశ్నలతో

(మిగతా 8వ పేజీలో...)



జిల్లా అదనపు కలెక్టర్‌గా విక్టోర్

- హెచ్ఎండీఏ నుంచి బదిలీపై జిల్లాకు రాక

కామారెడ్డి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 70 మంది అదనపు కలెక్టర్, స్పెషల్ కలెక్టర్‌లను బదిలీచేస్తు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లాకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా వి.విక్టోర్‌ను కేటాయిస్తు ప్రకటించింది. హెచ్ఎండీఏలో విధులు నిర్వహిస్తున్న వి.విక్టోర్‌ను కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా ప్రభుత్వం కేటాయించింది. గతంలో అదనపు కలెక్టర్‌గా పనిచేసిన చంద్రమోహన్ బదిలీపై వెళ్లిపోయారు. సుమారు రెండు నెలల పాటు ఈ పోస్టుఖాళీగా ఉంది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఇంచార్జ్‌గా కొనసాగుతున్నారు. ప్రభుత్వం జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి.విక్టోర్‌కు పూర్తి బాధ్యతలు అప్పగిస్తు ఆదేశాలు జారీ చేసింది.

రోడ్లపై ధాన్యం కుప్పల వల్ల ప్రయాణికులకు ప్రమాదాలు

రాజంపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):రోడ్లపై ధాన్యం కుప్పలుగా పోయడం వల్ల ప్రయాణికులకు ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్సై పుష్పరాజ్ అన్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాలలో రోడ్లపై ధాన్యం రైతులు ఆరబోస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని రైతులు వ్యవసాయ ఉత్పత్తుల కోసం ధాన్యం ఆర బోయడానికి రోడ్లను వినియోగించుకుంటున్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న, సోయా, జొన్న పంటలను ఆర బెట్టడానికి సమీపంలోని రోడ్లను కల్లాలుగా వాడుకుంటున్నారు. ఉదయం ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం కుప్పలు చేసి రాత్రిలో రోడ్లపై ఉంచడంతో రాత్రివేళ ప్రయాణికులు ప్రమాదాల బారీనపడుతున్నారని, రోడ్లపై ధాన్యం ఆర బెట్టేందుకు ఎలాంటి అనుమతులు లేవని, అయినప్పటికీ ఈ విషయమై చూసీచూడనట్లు ఉంటున్నామని తెలిపారు. అయితే రైతులు వరి ధాన్యాన్ని రోడ్డుపై పోసి ప్రమాదాలకు కారణమైతే.. ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేస్తామని ఎస్సై స్పష్టం చేశారు.

ముఠాగా ఏర్పడి లింగ నిర్ధారణ పరీక్షలు

- మొబైల్ వాహనం ద్వారా ఇంటికే వెళ్లి పరీక్షలు
- ఈ ముఠాపై ప్రత్యేక నిఘా
- పోలీసు బృందాల ద్వారా స్కానింగ్ సెంటర్లను పట్టుకుంటున్నాం
- ఇప్పటికే పలువురి అరెస్టు.. రిమాండ్
- బాధ్యులపై కఠిన చర్యలు
- వైద్య ఆరోగ్య శాఖనే కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది : జిల్లా ఎస్పీ సింధూశర్మ

కామారెడ్డి,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు కొందరు ఒక ముఠాను ఏర్పాటు చేసి నడిపిస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిందని జిల్లా ఎస్పీ సింధూశర్మ తెలిపారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసే ముఠా కదలికలను అడ్డుకునేందుకు పోలీసుశాఖ సమర్థవంతంగా పనిచేస్తోందని, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో ముఠాను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ యంత్రాలను తరలించే వారిపై పోలీసు శాఖ నిఘాపెట్టిందని, ఇందు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వివరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం లింగ నిర్ధారణ కేసుపై ఎస్పీ సింధూశర్మ పలు వివరాలను 'ఆంధ్రజ్యోతి'తో వెల్లడించారు. గత 5నెలల కింద జిల్లాకేంద్రంలో సమన్విత ఆసుపత్రిలో ఓ గర్భిణికి నెలలు నిండకుండానే ఆసుపత్రి వైద్యుడు ఆపరేషన్ చేసి ఆడ పసికందును ఇతరులకు విక్రయించిన దానిపై కొందరు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. ఈ దర్యాప్తులో సదరు ఆసుపత్రి నిర్వహకులు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తేలింది. ఈ కేసులో పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆ ఆసుపత్రిని సైతం సీజ్ చేయడం జరిగింది. అప్పటి నుంచి జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే దానిపై పోలీసుశాఖ నిఘా పెట్టింది. ఇందుకై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేశాం. సీసీఎస్ సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి, భిక్కనూర్ సీఐ సంపత్, రాజంపేట ఎస్సై పుష్పరాజ్‌ల ఆధ్వర్యంలో బృందాన్ని ఏర్పాటుచేసి లింగ నిర్ధారణచేసే ముఠాపై నిఘా పెట్టామని అన్నారు. ఈ బృందం లింగనిర్ధారణపైనే దృష్టి సారించి పకడ్బందీ ప్రణాళికతో ముఠా కదలికలపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగానే 15 రోజుల కిందట రాజంపేట మండల కేంద్రంలో ఓ వ్యక్తి ఇంట్లోనే గుట్టుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ యంత్రాలతో గర్భిణులకు పరీక్షలు చేస్తుండగా.. అతనిని అదుపులోకి తీసుకుని యంత్రాన్ని పోలీసులు సీజ్‌చేశారన్నారు. సదరు వ్యక్తితో పాటు మరో 16 మంది ఆర్ఎంపీలను గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని అన్నారు. రెండు రోజుల క్రితం కౌసల్య ఆసుపత్రికి చెందిన ఇట్టెం సిద్ధిరాములు ఓ స్కానింగ్ యంత్రాన్ని కారులో తరలిస్తుండగా.. పట్టణంలోని రైల్వే గేటు వద్ద పట్టణ సీఐ పట్టుకుని స్కానింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించారని అన్నారు. ఈ స్కానింగ్ యంత్రం ఇట్టెం సిద్ధిరాములు కొడుకు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పేరుమీద రిజిస్ట్రేషన్ అయి ఉంది. వారిని విచారించగా.. కౌసల్య ఆసుపత్రి పక్కన మరో గదిలో అదేరోజు మరో స్కానింగ్ యంత్రాన్ని గుర్తించడం జరిగిందన్నారు. ఈ యంత్రం డాక్టర్ హారిక, డాక్టర్ కిరణ్‌కుమార్‌ల పేరు మీద రిజిస్ట్రేషన్ అయి ఉంది. ఇలా జిల్లాలో ఇట్టెం సిద్ధిరాములుతో పాటు మరికొందరు ముఠాగా ఏర్పడి లింగనిర్ధారణ పరీక్షలను చేస్తున్నట్లు తెలుస్తుందన్నారు. ఈ ముఠా నెట్‌వర్క్‌ను మహారాష్ట్రతో పాటు కామారెడ్డి చుట్టుపక్కలజిల్లాలోను విస్తరించినట్లు తెలుస్తుంది. వీరంతా ముఠాగా ఏర్పడి స్కానింగ్ యంత్రాలను వాహనాలలో తీసుకెళ్లి గర్భిణుల ఇంటికి వెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తెలింది. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ వివరించారు. పోలీసుశాఖపరంగా వీళ్లపై ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశాలు లేవన్నారు. వైద్య ఆరోగ్యశాఖలోని పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం లింగ నిర్ధారణ చేసే వారిపై కేసులు నమోదు చేసే అధికారం ఆ శాఖకే ఉందన్నారు. పోలీసుల దర్యాప్తు వివరాలు, ఆధారాలతో వైద్య ఆరోగ్యశాఖకు అప్పగించామని, ఆ శాఖ తరఫున కోర్టులో నిందితులపై పిటిషన్ వేశారన్నారు. జిల్లాలో వైద్యఆరోగ్యశాఖ, పోలీసుశాఖల సమన్వయంతో ఈ ముఠాను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ముఠాను పట్టుకునేందుకు పోలీసుశాఖ సమర్థవంతంగా పనిచేస్తోందని వివరించారు.


మాట్లాడుతున్న ఎస్పీ సింధూశర్మ


వివరాలు వెల్లడిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్

విచారణ కొనసాగుతోంది : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

కామారెడ్డి టౌన్(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ పరీక్షల నిర్వహణలపై విచారణ కొనసాగుతుందని, ఈనెల 25న స్కానింగ్ మిషన్‌ల సీజ్‌చేసిన వాటిపై కోర్టులో కేసు నమోదుచేయడం జరిగిందని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం డీయంహెచ్‌వో కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన వస్తే తప్ప లింగనిర్ధారణ పరీక్షల కట్టడి చేయలేమని తెలిపారు. శాఖపరమైన చర్యలు చేపట్టడంలో ఎలాంటి లోపం లేదని అన్నారు. 2021లో కౌసల్య ఆసుపత్రి సీజ్‌చేసిన సమయంలో కోర్టులో

(మిగతా 8వ పేజీలో...)

జిల్లాలో నాణ్యమైన చేప పిల్లల పంపిణీ

- సైజ్ తగ్గిస్తే కాంట్రాక్టర్‌లకు నోటీసులు జారీ చేస్తాం
- జిల్లాలో ఇప్పటివరకు 104 చెరువుల్లో 9.56 లక్షల చేపపిల్లల విడుదల
- ఈ సీజన్‌లో 1.41 కోట్ల చేపపిల్లలను విడుదల చేయాలని లక్ష్యం
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీపతి

జిల్లాలో ఈ సీజన్‌లో.. చేప పిల్లల పంపిణీ కాస్త ఆలస్యం అయినప్పటికీ.. ఎంపిక చేసిన చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేస్తున్నాం. ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్‌లు నాణ్యమైన చేప పిల్లలనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. సైజ్ తక్కువగా ఉన్న చేపపిల్లలను పంపిణీచేస్తే కాంట్రాక్టర్‌లకు నోటీసులు జారీ చేస్తాం. ఇటీవల బాన్సువాడ, జంగంపల్లిలో సైజ్ తక్కువగా చేపపిల్లలు ఉన్నాయని మత్స్యకారులు తెలుపడంతో వాటిని తిరిగి పంపించాం. వాటి స్థానంలో కొత్త సీడ్‌ను కాంట్రాక్టర్‌ల చేత తెప్పిస్తున్నాం. జిల్లాలో చేప పిల్లల పంపిణీ కొనసాగుతోంది. లక్ష్యానికి తగ్గట్టుగా అన్ని చెరువుల్లో చేపపిల్లలను వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా మత్స్యశాఖఅధికారి శ్రీపతి అన్నారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లాలో మత్స్య సంపద, చేప పిల్లల పంపిణీ, పలు అంశాలపై వివరించారిలా..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ఆంధ్రజ్యోతి: జిల్లాలో మొత్తం ఎన్ని మత్స్యసహకార సంఘాలు ఉన్నాయి? వాటిలో ఎంతమంది సభ్యులు ఉన్నారు?

మత్స్యశాఖాధికారి: జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి,బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో మొత్తం 227 మత్స్యసహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక మత్స్యసహకార సంఘాలు 185, మహిళ మత్స్యశాఖ సహకార సంఘాలు 40,మత్స్యశాఖ మార్కెటింగ్ సొసైటీ 1, జిల్లా మత్స్యసహకార సంఘం 1 ఉన్నాయి. అంతేకాకుండా ఇందులో మొత్తం 13,894 మంది మత్స్యకారులు సభ్యత్వం పొందినవారు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి: ఈ సంవత్సరం ఎన్ని చేపపిల్లలను విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?

మత్స్యశాఖాధికారి: ఈ సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా మొదట నిర్దేశించిన ప్రకారం 2.80కోట్ల చేపపిల్లలను విడుదల చేయాలని నిర్ణయించాం. కాని ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిని కుదించి 1.45 కోట్ల చేపపిల్లలను విడుదల చేయాలని నిర్ణయించడం జరిగింది. ఇందుకు గాను 768 చెరువులను ఎంపిక చేశాం. చెరువులతో పాటు నిజాంసాగర్, పోచారం, కౌలాస్ ప్రాజెక్టులలో చేపపిల్లలను విడుదల చేస్తాం. ప్రస్తుతం చేపపిల్లల విడుదల ప్రక్రియ కొనసాగుతుంది.

ఆంధ్రజ్యోతి: ఇప్పటివరకు ఎన్ని చేపపిల్లలను విడుదల చేశారు?

మత్స్యశాఖాధికారి: గత 15 రోజుల నుంచి చేపపిల్లల విడుదల కార్యక్రమం కొనసాగుతుంది. జిల్లాలో 104 చెరువుల్లో 9,56,130 చేపపిల్లలను ఇప్పటివరకు విడుదల చేయడం జరిగింది. అధికారికంగా బాన్సువాడ,కామారెడ్డి నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాం. త్వరలోనే జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోను స్థానిక ఎమ్మెల్యేల అనుమతితో చేపపిల్లల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తాం

ఆంధ్రజ్యోతి: చేపపిల్లల పంపిణీకి ఎంత బడ్జెట్‌ను నిర్దేశించారు...?

మత్స్యశాఖాధికారి: జిల్లాలో ఈ సంవత్సరంలో 1.40 కోట్ల చేపపిల్లలను విడుదల చేయాలనే లక్ష్యంగా నిర్దేశించాం. ఇందులో రెండు రకాల చేపపిల్లలను ఎంపిక చేయడం జరుగుతుంది. 70లక్షల చేపపిల్లలు 35 నుంచి 40 మి.మిల సైజు గల ఒక్కోచేపను రూ.0.61 పైసలకు, 71లక్షల 80 నుంచి 100 మి.మిల సైజు గల చేపపిల్లలను రూ.1.61 పైసలకు కొనుగోలు చేయడం జరుగుతుంది. 70లక్షల చేపపిల్లలకు రూ.42.70లక్షలు, 71లక్షల చేపపిల్లలకు రూ.1.36 కోట్లు మొత్తం రూ.1.78 కోట్లు నిధులను కేటాయించడం జరుగుతుంది. వీటికి సంబంధించిన టెండర్లు ఇప్పటికే పూర్తయ్యాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్‌లు సీడ్‌ను సరాఫరాచేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఏఏ రకాల చేపపిల్లలను విడుదల చేస్తారు?

మత్స్యశాఖాధికారి: కట్ల,రోహు,బంగారుతీగ 35 నుంచి 40 మి.మిల సైజులో ఉన్న చేపపిల్లలను ఎంపిక చేసి విడుదలచేస్తాం. కట్ల,రోహు, మిరుగాల 80 నుంచి 100 మి.మిల సైజులో ఉన్న చేపపిల్లలను ఎంపిక చేసి విడుదల చేయడం జరుగుతుంది.

- కామారెడ్డి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి)

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

- చట్టపరంగా చర్యలు తప్పవు
- టపాకాయల దుకాణదారులకు పలు సూచనల జారీ
- ఎల్లారెడ్డి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కిష్టయ్య

7 లో

హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- మాజీ ఎంపీ బీబీ పాటిల్
- నాగిరెడ్డిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో రైతు పోరు యాత్ర కార్యక్రమం
- పెద్దసంఖ్యలో తరలి వచ్చిన రైతులు, పార్టీ కార్యకర్తలు

8 లో

బీటీ రహదారికి నిధుల మంజూరుతో గ్రామస్థుల హర్షం

● వర్షాకాలం వచ్చిందంటే గ్రామస్థులకు నరకం ● అత్యవసరంగా ఆసుపత్రికి వెళ్లాలంటే నానా కష్టాలు పడాల్సిందే ● పట్టించుకోని అధికారులు



చింతల్‌వాడీ గ్రామానికి వేళ్లే రహదారి ఇదే..

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ మండలం నుండి చింతల్‌వాడీ గ్రామం మారుమూల ప్రాంతంలో ఉంది. గతంలో ఈ గ్రామం జుక్కల్ మండలంలో ఉండగా గత కొద్ది సంవత్సరాల కిందట ఈ గ్రామాన్ని పెద్ద కొడప్‌గల్ మండల పరిధిలోకి మర్చారు. కౌలాస్ నాలా ప్రాజెక్టుకు ఎగువ భాగంలో చింతల్‌వాడీ గ్రామం ఉంది. ఈగ్రామంలో సుమారు 3వందలకు పైగా జనాభా ఉండగా వారంతా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. బాబల్‌గాం గ్రామ పంచాయతీ పరిధిలో ఈ గ్రామం ఉంటుంది. బాబల్‌గాం గ్రామానికి వెళ్లే బీటీ రహదారి నుంచి ఈ గ్రామానికి వెళ్లాలంటే సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రెండు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా మట్టితో కూడుకున్నది కావడంతో ప్రతి సంవత్సరం వర్షాకాలం వస్తే ఈ గ్రామానికి వెళ్లడం గగనమే. రెండు కిలోమీటర్ల మేర ఉన్న రహదారి వానకాలంలో పూర్తిగా బురదతో నిండి ఉండటంతో అత్యవసర పనులు నిమిత్తం, ఆసుపత్రికి వెళ్లాల్సినవారు ఈ రహదారిపై నానా కష్టాలు పడి ప్రయాణం సాగిస్తుంటారు. గత పాలకులకు ఈ రహదారిపై బీటీ నిర్మించాలని గ్రామస్థులు ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదు. ఇటీవల జుక్కల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తోట లక్ష్మీకాంతారావ్‌కు చింతల్‌వాడీ గ్రామస్థులు తమకు బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరడంతో అందుకు స్పందించిన ఎమ్మెల్యే బాబల్‌గాం జడ్పీ రహదారి నుంచి చింతల్‌వాడీ తండా వరకు సుమారు 2 కిలోమీటర్ల నిర్మాణానికి రూ2 కోట్ల 40 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఇటీవల ప్రభుత్వం జుక్కల్ నియోజక వర్గంలో 8 గ్రామాలలో బీటీ రహదారుల నిర్మాణానికి గాను 15 కోట్లరూపాయల నిధులు మంజూరు చేసింది. దీంట్లో చింతల్‌వాడీ గ్రామ రహదారి నిర్మాణానికి కూడ 2 రూ.కోట్ల 40 లక్షల రూపాయల నిధులు మంజూరు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వెళ్లడానికి సరియైన రహదారి లేక అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నామని, తమ గ్రామానికి బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన జుక్కల్ ఎమ్మెల్యేకు రుణపడి ఉంటామని తెలిపారు. గతంలో తాము బీటీ రహదారి నిర్మాణం చేపట్టాలని చాలా రోజులుగా ప్రజాప్రతినిధులకు విన్నవించిన తమ గోడు ఎవరూ వినలేదని, ప్రస్తుతం తమకు బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉందని తెలిపారు. సంబంధిత అధికారులు టెండర్లు పూర్తి చేసి బీటీ రహదారి నిర్మాణం పనులు తొందరగా చేపట్టాలని కోరుతున్నారు.

బురద మయంగా మారిన రోడ్డు



మా గ్రామం నుండి బాబల్‌గాం ప్రధాన రహదారికి వెళ్లాలంటే సుమారు 2 కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు ఉంటుంది.వానాకాలంలో ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే కష్టంగా ఉంటుంది, రహదారి బురదమయంగా ఉండి గుంతలు పడటంతో వానాకాలంలో మోటార్ సైకిళ్లపై ప్రయాణం చేయడం ఇబ్బందికరంగా ఉంటుంది. వర్షం ఎక్కువగా కురిస్తే గ్రామానికి నడచ ుకుంటూ వెళ్లాల్సిందే మరి.

- తుకరాం రెడ్డి గ్రామస్తులు చింతల్‌వాడీ

చీకటి పడిందంటే గ్రామానికి వెళ్లాలంటే భయం



వర్షకాలంలో చింతల్‌వాడీ గ్రామంలో ఏదైనా అనారోగ్యం చేస్తే ఆసుపత్రికి వెళ్లాలంటే చుక్కలు కనడబడుతాయి. రహ దారిపై గుంతలు పడటంతో అంబులెన్స్ రాక గర్భిణులు ముందే సురక్షిత గ్రామాలకు వెళ్తారు. అంతేగాక పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లిన సమయంలో చీకటి పడితే గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది. గ్రామస్థుల కోరిక మేరకు బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు రుణ పడి ఉంటాం.

- దశరథ్ యువకుడు చింతల్‌వాడీ గ్రామం

కార్యదర్శిగా నీలా సొసైటీలో సస్పెండ్..
రెంజల్ సొసైటీలో క్లర్క్‌గా విధులు



సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఆర్డర్

రెంజల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఆయన ఓ అవినీతి అధికారిగా ముద్ర పడడంతో విధుల నుండి పక్కన బెట్టారు. కాని ఆయనకు అధికారుల అండదండలు ఉండడంతో మరోచోట క్లర్క్‌గా తీసుకోవడంతో దర్జాగా విధులు నిర్వహిస్తున్నారు. వివరాల్లోకి వెళ్లగా ఈ సంవత్సరం జనవరి 10వ తేదిన రెంజల్ మండలం నీలా సొసైటీ కార్యదర్శి ఇంతియాజ్ అక్రమార్కులకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో జిల్లా కోఆపరేటివ్ అధికారులు విచారణ చేపట్టారు. అప్పటి నుండి ఆయనను కార్యదర్శి విధుల నుండి తప్పించారు. అయిన కూడా అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో రెంజల్ సొసైటీలో క్లర్క్‌గా నియమించారు. అవినీతికి పాల్పడినట్లు రుజువు కావడంతో జిల్లా కోఆపరేటివ్ అధికారి ఈ నెల 17న సస్పెండ్ చేశారు. సస్పెండ్ లేటర్‌ను పక్కన పెట్టి రెంజల్ సొసైటీలో ఇంతియాజ్‌ను క్లర్క్‌గా తీసుకోవడం పట్ల పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక మారు రైతుల సొమ్మును కాజేసి అవినీతి అధికారిగా ముద్రపడిన అధికారిని మరోచోట క్లర్‌గా విధుల్లోకి తీసుకోవడం ఏమిటని రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆలూర్‌లో బౌద్ద దీపావళి ఘనంగా నిర్వహించాలి



ఆలూర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు

పెర్కిట్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్దుడు జ్ఞాన అన్వేషణ కపిల వస్తున్న కార్తిక పౌర్ణమి రోజు ప్రజలు దీపాలు వెలిగించి బుద్దుడిని స్వాగతించిన రోజే ఘనంగా బౌద్ద దీపావళి జరుపుకోవాలని డాక్టర్ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఇత్వార్‌పేట్ లింగన్న అన్నారు. సోమవారం ఆర్మూర్ మండల కేంద్రంలో బుద్ద విహార నిర్మాణ పనులను పరిశీలనకు జిల్లా నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దర్థ గౌతముడు రైతు జాతి ముద్దుబిడ్డ అని గౌతముని జ్ఞానప్రప్తితో తిరిగి వస్తున్న శుభవేళ ఊరిలో తొలివిడత పంటలు కోతకు వస్తున్న శుభసందర్భంలో బుద్దిస్ట్ పండగను జరుపుకోవడం సాంప్రదాయమన్నారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ ఎస్టీ, బీసీ ప్రజలందరు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీ ఆయమ్మను సన్మానిస్తున్న దృశ్యం

రెంజల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలోని బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి అన్నారు. సోమవారం మండలంలోని కిసాన్ తండాలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సెక్టార్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో తప్పనిసరిగా న్యూట్రిషన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసి, ప్రతి నెల 5వ తేదిన పిల్లల బరువు చూడాలన్నారు. ప్రతి చిన్నారికి బరువులను గుర్తించి తక్కువ బరువు ఉన్న పిల్లలకు పౌష్టికాహారం కోసం న్యూట్రిషన్ సెంటర్ ఏర్పాటు చేసి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఇటీవల దూపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో ఆయమ్మగా విధులు నిర్వహిస్తున్న గంగామణి పదవి విరమణ పొందడంతో సోమవారం ఆమెకు శాలువ, పూలమాలలతో ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి, సూపరిండెంట్ శ్రీనివాస్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఏర్గట్ల, అక్టోబరు 28 (ఆంధ్యజ్యోతి) : మండల కేంద్రంలోని అయప్పస్వామి దేవాలయానికి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు వ్యక్తి మృతిచెందాడు. స్థానిక ఏఎస్సై లక్ష్మన్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం స్విఫ్ట్ కారు టీవీఎస్ చాంప్ వాహనాలు రెండు ఎదురెదురుగా ఢీకొనడంతో ఏర్గట్ల గ్రామానికి చెందిన గాండ్ల నాగయ్య(45) అక్కడిక్కడే మృతి చెంద గా భార్య జమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతుదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

డొంకేశ్వర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే తమ సమస్యలను పరిష్కరించాలని తపస్ జిల్లా కార్యవర్గ సభ్యులు గంగాధర్ డిమాండ్ చేశారు. సోమవారం పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని డొంకేశ్వర్ తహసీల్దార్‌కు వినతి అందజేశారు. ధర్మబద్దంగా ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక చెల్లింపులను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మండల తాపస్ అధ్యక్షుడు సుదర్శన్ ఉన్నారు.

ముప్కాల్ : కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగానే తమ సమస్యలను పరిష్కరించాలని ముప్కాల్ మండల అధ్య క్షుడు సుంకరి రవికుమార్ డిమాండ్ చేశారు. తపస్ ముప్కాల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో మండల తపస్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధానకార్యదర్శి కనకాద్రి, జిల్లా బాధ్యులు కోటగిరి రమేష్, సభ్యులు ఓంప్రకాష్, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి : పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్మర్‌పల్లి మండల (తపస్) తెలంగాణ ప్రాతీయ ఉపాధ్యాయ సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ ఆంజనేయులకు వినతిపత్రాన్ని అందజేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో టీయూపీఎస్ డివిజన్ కార్యదర్శి శంకర్ గౌడ్, మండల అధ్య క్షుడు సల్లూరి కిషన్ గౌడ్, గుండోజి రవిందర్, మాసం శ్రీనివాస్ గౌడ్, గుజ్జేటి రవిందర్, రవి కిషన్‌పాల్గొన్నారు.

మోస్రా: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలో మండల తపస్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయబద్దంగా రావాల్సిన నాలుగు డీఏలు పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని మండల తహసీల్దార్ మారుతిని కలిసి పూర్తి వివరాలు తెలియపరచి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తపస్ మండల అధ్యక్షుడు గాండ్ల మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి హరికృష్ణ, ఉపాధ్యాయుడు నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : రూరల్‌సీఐ



క్రీడాకారులకు పరిచయం చేసుకుంటున్న ఆర్మూర్‌రూరల్ సీఐ

మెండోర, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని ఆర్మూర్‌రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మెండోర మండల కేంద్రంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మాకూరి వినోద్, గుంటి రవి స్మారక కబడ్డీ, వాలీబాల్, ఓపెన్ టోర్నమెంట్ పోటీలను ఆర్మూర్‌రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని క్రీడలు స్ఫూర్తిని రగలించి జీవితాన్ని ఆనందమయం చేస్తాయని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు క్రీడల్లో రాణించి జాతీయస్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సావెల్ సొసైటీ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, మిట్టపల్లి రాజేశ్వర్, నోముల సాయిరెడ్డి, వ్యాయమ ఉపాధ్యాయులు శ్యామ్; అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మోకన్‌పల్లికి చెందిన టేకు ముత్తెమ్మ అనే 85సంవత్సరాల వృద్ధురాలు అదృశ్యమైందని ఎస్ఐ వినయ్ తెలిపారు. ఆమెకు గత కొంతకాలంగా మతిస్థిమితం లేదని ఈ నెల 26న ఉదయం బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదని అన్నారు. కుమారుడు గంగారాం ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి), మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తాలో గుర్తుతెలియని దొంగలు ఏటీఎంలో డబ్బులు దొంగిలించేందుకు యత్నించారు. ఆదివారం అర్ధరాత్రి చౌరస్తాలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు చెందిన ఏటీఎంలోని కేబుల్ వైర్‌ను కట్ చేశారని బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

మెండోర, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి), మండలంలో బుస్సాపూర్ ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రిజిస్టర్‌ను, రికార్డులను అదే విధంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలను ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు మండల విద్యాధికారిణి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శమంత, ఉపాధ్యాయులు ఓరమేష్, కవిత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

డొంకేశ్వర్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి), డొంకేశ్వర్ మండలంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌కుమార్‌రెడ్డి పరారమ్మించారు. సోమవారం డొంకేశ్వర్ మండలం చిన్నాయానం, అన్నారం, సిర్పూర్, గాదేపల్లి, నడ్కుడ గ్రామాల్లో ఆయన పలు కుటుంబాలను పరామర్శించి భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల భూమేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భరత్‌రెడ్డి, మహిపాల్, గణేష్‌గౌడ్, బోజారెడ్డి, దేగాం గంగారెడ్డి, శ్యామ్‌గౌడ్, నాగరాజ్, ఎర్రం లింగం, తదితరులు పాల్గొన్నారు.

పోతంగల్‌లో ఎంఈవోకు సన్మానం

కోటగిరి,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల విద్యాధికారి లోలశంకర్‌ను సోమవారం ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. పోతంగల్ మండలం ఏర్పాటైన రెండేళ్లకు పూర్తిస్థాయి ఎంఈవోను నియమించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. పోతంగల్ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని గ్రామస్థులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాయిలు, రిటైర్డ్ ప్రొఫెసర్ లక్ష్మణ్, రిటైర్డ్ ఈవో గంగాధర్, మాజీ సర్పంచ్ శంకర్, పీరయ్య పాల్గొన్నారు.

పోషణ లోపం ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : సీడీపీవో



మాట్లాడుతున్న సీడీపీవో స్వర్ణలత

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ఆరు మాసాల నుండి 5సంవత్సరాల లోపు గల చిన్నారులలో పోషణ లోపం ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీవో స్వర్ణలత కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అంగన్‌వాడీ టీచర్‌లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు పర్యవేక్షణతో కూడిన అనుబంధ పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులలో తీవ్ర లోప పోషణ తప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం మహిళ శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. నవజాత శిశుల సంరక్షణతో పాటు ఆరు మాసాల నుండి 5సంవత్సరాల లోపు గల చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రాధాలక్ష్మి, భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప తదితరులున్నారు.

జాతీయ సమైక్యత కోసమే ఏక్ భారత్ శ్రేష్ట భారత్

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి



చాయచిత్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సమైక్యత స్ఫూర్తిని ప్రోత్సహించడమే ఏక్‌భారత్ శ్రేష్ఠభారత్ లక్ష్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌పై చాయచిత్ర ప్రదర్శనను ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేష్ ఆధ్వర్యంలో ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ పై చాయచిత్ర ప్రదర్శన నిర్వహించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు, యువతలో దేశభక్తి స్వాతంత్ర ఉద్యమం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తుందన్నారు.కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరోఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటి ఆఫీసర్ ధర్మనాయక్, డిగ్రి కళాశాల ప్రిన్సిపాల్ వై. వేణు ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునిత, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయనాథ్‌రెడ్డి, టిఎం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నహిదఫిర్దౌస్, రవీందర్‌రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎంఆర్ఈఐఎస్ ఉద్యోగ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీకి వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):పీఎంఆర్ఈఐఎస్‌లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఆమేర్ అలీ ఖాన్‌కు వినతిపత్రం అందించారు. బోధన్‌కు ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్సీ అమేర్ అలీ ఖాన్‌కు తెలంగాణ ప్రభుత్వం మైనారిటీలకై ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని అందులో భాగంగా మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థుల కోసం వినూత్న రీతిలో ఎన్నో పథకాలు ఇంటర్ తర్వాత ఎంసెట్, నీట్‌లో ర్యాంకు సాధించడానికి కావాల్సిన పుస్తకాలు, ఫ్యాకల్టీ, మౌలిక వసతులు కల్పించి వారి అభివృద్ధికై ఎంతో కృషి చేస్తుందన్నారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో స్టేట్ అడ్వయిజర్ కౌన్సిల్ కాలేజ్ ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్దుల్ బషీర్, జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ అమేద్, ఉపాధ్యక్షులు మహ్మద్ షఫీ, జమీల్ అహ్మద్ ఖాన్, మహ్మద్ మాజీద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి

ముప్కాల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బాల్కొండ ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, సొసైటీ చైర్మన్ నాగులపల్లి సూరజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి అమ్ముకోవాలని, ఎట్టి పరిస్థి తుల్లో దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైతులందరు 17 శాతం తేమతో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి విండో పరిదిలోని కంచర్ల గ్రామంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ వైస్‌చైర్మన్ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్‌చైర్మన్ మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో విండో సీఈవో మోహన్‌గౌడ్, విండో డైరెక్టర్లు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

నవీపేట : మండలంలోని నవీపేట, బినోల సొసైటీల ఆధ్వర్యంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన "ధాన్యం కొనుగోళ్లు సకాలంలో జరిగేనా?"అనే వార్తకు అధికారులు స్పందించారు. నవీపేటలో సొసైటీ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించగా బినోల సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని జన్నేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట రమణ, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, నవీపేట సొసైటీ చైర్మన్ అబ్బన్న, వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్, బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, వైస్ చైర్మన్ బాబర్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభమెప్పుడు..?

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వరి కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారని రైతులు అయోమయానికి గురవుతున్నారు. సొసైటీ ఆధ్వర్యంలో పోచమ్మగల్లీ, దోబీఘాట్ వద్ద, అలాగే మెప్మా ఆధ్వర్యంలో పిప్రి రోడ్డు డిగ్రీ కళాశాల, పెర్కిట్‌లోని వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేవారు. రైతులు వరి కోతలు ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఎప్పుడు అకాల వర్షంతో నష్టపోతామేనని భయంతో దళారులను ఆశ్రయించి సన్నరకం వడ్లకు రూ.2200నుంచి రూ.2600వరకు అమ్మేస్తున్నారు. దళారులకు అమ్మడంతో రాష్ట్ర ప్రభుత్వం సన్నరకానికి ఇస్తానని రూ.500 బోనస్ నష్టపో తామనే భయంతో మరికొందరు ఆరబెటి న కల్లాలలో అలాగే ఉంచారు. కష్టపడ్డ పంటకు ఇటు అకాల వర్షాలు భయపెడుతున్నా యన్నారు. అటు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ రైతుల మదిలో మెదిలి అయోమయానికి గురవుతున్నారు. తక్షణమే వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



జన్నేపల్లిలో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

నవీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి, నవీపేటలలో సోమవారం ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజీద్‌హుస్సేన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. స్టాక్ బోర్డులపై ప్రతిరోజు ఎరువుల వివరాలు నమోదు చేయాలని, రైతులకు ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రసీదు తప్పకుండా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో నవీన్ కుమార్, తదితరులున్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

డొంకేశ్వర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ తహసీల్దార్‌గా ఎం.నరేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. గత 40రోజులుగా బాధ్యతలు చేపట్టిన షైమద్‌హుస్సైన్ నిజామాబాద్ కలెక్టరేట్‌కు బదిలీపై వెళ్ళారు. నూతన తహసీల్దార్ సిబ్బంది శాలువతో సన్మానించారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

నవీపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్‌కు చెందిన సుంకరి చాయ అనే 30సంవత్సరాల వివాహిత మహిళతో పాటు 11 సంవత్సరాల రాఘవి అనే కూతురు, రితిక్ అనే 7సంవత్సరాల కుమారుడు అదృశ్యమయ్యాడని ఎస్ఐ వినయ్ తెలిపారు. మిట్టాపూర్‌కు చెందిన రాజేందర్‌తో చాయకు 12సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని, వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నాడని అన్నారు. పెద్దకూతురు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటుండగా చిన్నకూతురు రాఘవి, కుమారుడు రితిక్‌లు తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారన్నారు. ఈ నెల 27న చాయతో పాటు కుమార్తె రాఘవి, కుమారుడు రితిక్‌లు అదృశ్యమయ్యారన్నారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై తనకు అనుమానం ఉందని భర్త రాజేందర్ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమాలపై అవగాహన అవసరం

సదాశివనగర్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):సామాజిక మాధ్యమాల వల్ల ఎదురవుతున్న సమస్యలను ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకుని ముందుకు సాగాలని ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అమృతరాజేందర్‌రావు అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో సదాశివనగర్ మండల మహిళ సమాఖ్య సమావేశంలో పాల్గొని మానవ అక్రమరవాణా, సామాజిక మాధ్యమల వల్ల ఎదురవుతున్న సమస్యలు, మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు, బాల్యవివాహలు, మానసిక ఆరోగ్యం అంశాలపై సమావేశంలో పాల్గొని అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తుల నుంచి ఓటీపీలు చెప్పడం గాని లింక్‌లు గాని ఓపెన్ చేయడం చేయకూడదని అలా చేయడం వల్ల మన బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న నగదు తస్కరించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఏపీడీ మురళికృష్ణ, డీపీఎం సుధాకర్, రవీందర్‌రావు, వకుళ, ఏపీఎం రాజారెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, సంస్థ ప్రతినిధులు విఠల్‌రావు, వివిధ గ్రామాల అధ్యక్షులు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం రాశులు ఎక్కడికక్కడే..

- కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా ధాన్యం కొనుగోలు చేయడం లేదంటున్న రైతులు
- మోపాల్, సిరికొండలో ఎక్కడికక్కడ నిలిచిపోయిన ధాన్యం రాశులు
- వర్షభయంతో రైస్‌మిల్లులు, దళారులకు అమ్ముకుంటున్న రైతులు
- మద్దతు ధర రావడం లేదని రైతుల ఆవేదన
- అధికారులు స్పందించాలంటున్న అన్నదాతలు

మోపాల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి చేసి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా తమ ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై రోజులు గడుస్తున్నప్పటికీ అధికారులు మాత్రం ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు ధాన్యాన్ని దళారులకు, రైస్‌మిల్లకు అమ్ముకుంటున్నారు. పంటను కోసి రోడ్లపైనా, పొలాల్లో ఆరబెట్టుకుంటున్నామని, వాతావరణ పరిస్థితుల వల్ల ఎక్కడ నష్టపోతామోనని రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నామని చెప్తున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం చేయడం వల్లే పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం ఈపాటికే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని ఇప్పుడు మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారోనని మండిపడుతున్నారు. గ్రామాల్లో సొసైటీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఆర్భాటంగా ప్రారంభం చేశారు. చేసి రోజులు గడుస్తున్నా రైతుల ధాన్యాన్ని మాత్రం తీసుకోవడం లేదని వాపోతున్నారు. పాలకులు ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకొని మోసపోవద్దని చెప్పడం తప్ప ఆచరణలో మాత్రం పాటించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మాధవనగర్, మోపాల్, కులాస్‌పూర్, బాడ్సి గ్రామాల్లో ఇప్పటికే కొనుగోలు ప్రారంభించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోకుండా చూడాలని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు ప్రైవేటు వ్యక్తులకు పండించిన ధాన్యాన్ని అమ్మేసేకున్నారు.

కేంద్రాలను ప్రారంభించి.. కొనుగోళ్లు మరిచి..

సిరికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యేలు, ఐడీసీఎంఎస్ అధ్యక్షులు ఆగమేఘాలపై ప్రారంభించి ఎనిమిది రోజులు కావస్తున్న ధాన్యాన్ని మాత్రం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సిరికొండ మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు వానకాలం పంటను కోస్తున్నారు. ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబోస్తున్నారు. తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తాయని భావించిన రైతులు వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పీఏసీఎస్, ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ఐడీసీఎంఎస్ అధ్యక్షులు తారచంద్‌నాయక్ ఆగమేఘాలపై గ్రామాల్లో ప్రారంభించి వారం రోజులు గడిచింది. కళ్లాల్లో ధాన్యం ఎండిపోతుందని, బరువు తగ్గిపోతుందని రైతులు చెపుతున్నారు. కేంద్రాలను ప్రారంభించి వారం గడుస్తున్నా నేటికీ రైస్‌మిల్లుల అలాట్‌మెంట్ చేయకపోవడం వల్ల రైతుల్లో ఆందోళన మొదలైంది. గోనే సంచులను కేంద్రాలకు చేర్చిన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడం రైతుల్ని బాధిస్తోంది. ప్రభుత్వం ఏ గ్రేడు క్వింటా ధాన్యానికి రూ.2320 చెల్లిస్తుండగా.. వ్యాపారులు క్వింటా ధాన్యం రూ.2200 మాత్రమే చెల్లిస్తున్నట్లు రైతులు చెప్తున్నారు. రైతులు ధాన్యం బరువు తగ్గుతుందని, వర్షాలు కురిస్తే తడిసిపోతుందనే భయంతో వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. సన్నరకం క్వింటా ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లింస్తుందని ప్రకటించిన నేపథ్యంలో రైతులు సన్నరకం ధాన్యాన్ని అమ్ముకోకుండా ఆరబెట్టి కుప్పలు పోసి తూకం వేయడానికి సిద్ధంగా ఉంచుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయడం ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. మరింత ఆలస్యం చేస్తే దొడ్డు రకం ధాన్యాన్ని వ్యాపారులకు అమ్ముకోవడానికి సిద్ధపడుతారని కొంతమంది రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికే రైతుల్లో కొంత అసంతృప్తి మొదలవుతోంది. వానాకాలం పంట కోయడం పూర్తి కావస్తున్నా నేటికీ రైతు భరోసా డబ్బులు వేయకపోవడంతో పాటు రూ.రెండు లక్షల రుణమాఫీ కాకపోవడం వల్ల రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది. ప్రభుత్వం పట్ల కొంత మేరకు వ్యతిరేకత ఎదురవుతోంది. ధాన్యం కొనుగోలు చేయడం ప్రారంభించకపోతే అగ్నికి ఆజ్యం పోసినట్లు అవుతుందని మరికొందరు రైతులు చెప్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైస్‌మిల్లుల అలాట్‌మెంట్ చేసి ధాన్యాన్ని కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకుంటున్నాం..

- రైతు, గంగాధర్



గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. వాతావరణ పరిస్థితుల బాగోలేవు. ఎప్పుడు వర్షం కురుస్తుందో తెలియని పరిస్థితి. దీంతో గత్యంతరం లేక ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సి వస్తోంది. క్వింటాకు రూ.2300 వరకూ చెల్లిస్తున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తే ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకునే పరిస్థితి వచ్చేది కాదు. వాతావరణ పరిస్థితులతో నష్టపోతామోనని భయానికి అమ్ముకుంటున్నాం.



కమ్మర్‌పల్లి శివారులోని జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



సూచిక బోర్డు కనిపించని నాగాపూర్ రహదారి



గ్రామశివారులో రహదారిపై ధ్వంసమైన కల్వర్టు



కమ్మర్‌పల్లి రహదారిపై రక్షణ గోడ లేకుండా ఉన్న కల్వర్టు

కమ్మర్‌పల్లి జాతీయరహదారిపై
ప్రమాదఘంటికలు!

» ప్రమాదకరంగా మలుపులు, కూలిన కల్వర్టులు » తరుచూ ప్రమాదాలు » పట్టించుకునేవారే కరువు

కమ్మర్‌పల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండలకేంద్రం మీదుగా సాగుతున్న జాతీయ రహదారి 63పై ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. ఈ రహదారిపై అనేక ఓ వైపు ప్రమాదకర మలుపులు, మరోవైపు కూలిన కల్వర్టులు దర్శనమిస్తున్నాయి. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాల చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారిపై ఈ దుస్థితి నెలకొని ఉన్నా ఎవరికీ పట్టింపు లేకుండా పోతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కమ్మర్‌పల్లి మండల ప్రారంభం నుంచి జిల్లా సరిహద్దు గండిహనుమాన్ వరకు కేవలం ఆరు కిలోమీటర్ల దూరం వరకు జాతీయరహదారి 63 వస్తోంది. అయితే ఈ రహదారి మధ్యలో ఐదు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. కానీ ఎక్కడ కూడా సూచిక బోర్డులు లేవు. కాగా ఈ రహదారి పక్క నుంచే తిమ్మాపూర్, నాగాపూర్ గ్రామాలకు వెళ్లేందుకు రహదారులు ఉన్నా కనీసం గ్రామాలకు సంబంధించిన సూచిక బోర్డులు కనిపించవు. దగ్గరి వరకు వస్తే తప్ప ఈరహదాలరులున్నట్లు కనిపించవు. ఇదిలాఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద సుమారు 90డిగ్రీల మలుపు ఉంది. మలుపు ప్రారంభం నుంచి పోలీస్‌స్టేషన్ దాటే వరకు రెండు పెట్రోల్ బంక్‌లు తిమ్మాపూర్ రహదారి వస్తోంది. కమ్మర్‌పల్లి మండలకేంద్రం శివారులో నాగాపూర్ గ్రామ రహదారి వస్తుంది. కానీ ఎక్కడ కూడా మలుపులు ఉన్నట్లు, గ్రామ రహదారులు ఉన్నట్లు సూచికలు ఏర్పాటు చేయలేదు. ఇదిలాఉంటే ఆరు కిలోమీటర్ల దూరంలో జాతీయరహదారిపై ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని కల్వర్టులైతే ధ్వంసం కాగా, మరికొన్ని కల్వర్టులు రహదారికి సమానమై ఉన్నాయి. కొన్ని కల్వర్టుల వద్ద కనీస రక్షణ గోడలు కానీ, సూచిక బోర్డులు కానీ లేవు. వాహనదారులు ఆదమరిస్తే అంతేసంగతులు. కల్వర్టు తెలియక అందులోకి వాహనాలు దూసుకుపోయి ప్రమాదాలకు దారితీసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. జాతీయరహదారి వెట ఉన్న మొక్కలు ఏపుగా పెరిగినా కొమ్మలు తొలగించకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకున్న ఘటనలు లేకపోలేదు. పత్రికల్లో ప్రమాదవార్తలు చూస్తున్న సంబంధిత శాఖ అధికారుల్లో చలనం లేకపోవడం పట్ల వాహనాదారులు, స్థానికుల నుంచి నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు జాతీయరహదారిపై, కల్వర్టులకు మరమ్మతులు, ప్రమాద మలుపులు, గ్రామాల రహదారుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనాదారులు వేడుకుంటున్నారు.

ఇంటర్వ్యూ

నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు

- టపాసుల దుకాణాల లైసెన్స్‌దారులు జాగ్రత్తలు పాటించాలి
- ఎల్లారెడ్డి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కిష్టయ్య



ఎల్లారెడ్డి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాల లైసెన్స్‌దారులు నిబంధనలు పాటించకపోతే ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే లైసెన్స్ రద్దు చేస్తామని, అదే విధంగా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎల్లారెడ్డి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కిష్టయ్య 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై వివరాలు వెల్లడించారు.

• ఆంధ్రజ్యోతి: టపాకాయల దుకాణదారులు ఎలాంటి నిబంధనలు పాటించాలి?

అధికారి: టపాసుల దుకాణాలను జనవాసాలు లేని ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకోవాలి. వారికి ఈ లైసెన్స్‌లు తాత్కాలికంగా జారీ చేస్తాం. ఎల్లారెడ్డిలో నవంబర్ 2వ తేదీ వరకు దుకాణాలను నిర్వహించేలా లైసెన్స్‌లు జారీ చేశాం.

• ఆంధ్రజ్యోతి: నిబంధనలు పాటించకపోతే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

అధికారి: ఎల్లారెడ్డిలో ప్రతీ సంవత్సరం ఏర్పాటు చేసుకుంటున్న ప్రాంతంలోని దుకాణాలు ఏర్పాటు చేసేందుకు లైసెన్స్‌లు జారీ చేశాం. 50మీటర్ల నిబంధనల అంశంపై జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. ప్రతి దుకాణంలో వంద కిలోల మేరకు మాత్రమే నిబంధన పాటించాలి. ఈ అంశంపై జిల్లా ఫైర్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

• ఆంధ్రజ్యోతి: దుకాణాల ఏర్పాటుకు ఏయే నిబంధనలు పాటించాలి?

అధికారి: రేకుల షెడ్డులతో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలి. ఒక్కో దుకాణానికి మూడు మీటర్ల దూరం పాటించాలి. 200 లీటర్ల సామర్థ్యం గల రెండు వాటర్ బ్యారళ్ళను ఆరు బకెట్లను ఏర్పాటు చేసుకోవాలి. వీటిలో మూడు బకెట్లను ఇసుకతో, మరో మూడు బకెట్లను నీళ్లతో ఉన్నవి ఏర్పాటు చేసుకోవాలి.

• ఆంధ్రజ్యోతి: అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

అధికారి: అగ్నిప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాల్సిందే. ఆయిల్ బర్నింగ్ ల్యాంప్స్, గ్యాస్ ల్యాంప్స్ తదితరన వాటిని విద్యుత్ కోసం ఏర్పాటు చేసుకోరాదు. అలాగే బీడీ, సిగరెట్ తాగడం పూర్తిగా నిషేధించాలి. విద్యుత్ దీపాల కోసం ఏర్పాటు చేసుకున్న ఎలక్ట్రికల్ వైర్లు ఏర్పాట్ల అంశంపై పూర్తి జాగ్రత్తలు చేపట్టాలి.



డొంకేశ్వర్ పీహెచ్‌సీలో వ్యాధులపై రికార్డులో నమోదు చేస్తున్న సిబ్బంది

షుగర్, బీపీ పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

పెరిగిన మాత్రల వినియోగం

- చిన్న సమస్యలకూ మాత్రలు మింగుతున్న ప్రజలు
- అధికమవుతున్న బీపీ, మధుమేహం, గుండె, శ్వాస సంబంధిత వ్యాధిగ్రస్తులు

డొంకేశ్వర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పూర్వకాలంలో ప్రజలు ఎటువంటి రోగాలు వచ్చినా మందులు మింగకుండానే రోగాలను తగ్గించుకునేవారు. తీవ్రమైన జలుబు వస్తే వంటింటి చిట్కాలు వంటి నయమాలు పాటిస్తూ వాటిని నయం చేసుకునేవారు. అత్యవసరమైన పరిస్థితులు వస్తే తప్ప మందులు గోలిలు వాడకం ఉండేది. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆహారాన్ని ఔషధంగా తీసుకొని స్థాయి నుంచి ఔషధాలే ఆహారంగా తీసుకునేలా తయారయ్యారు. నిద్ర లేచినప్పటి నుంచి నిద్రపోయే వరకు బీపీ, మధుమేహం, గుండె, శ్వాస సంబంధిత వ్యాధులు మనిషిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకప్పుడు షుగర్ వ్యాధి అనేది 50 ఏళ్ల పైబడిన వాళ్ళకు మాత్రమే వచ్చే అవకాశాలు ఉండేవి. కానీ నేడు అప్పుడే పుట్టిన పిల్లలు సైతం డయాబెటిక్ వ్యాధి బారిన పడుతుండడం ఆందోళన కలిగించే అంశం. జీవనశైలిలో మార్పులు మనిషి జీవితాన్ని నాశనం చేస్తున్నాయి. ఆహార నియమాలు పాటించకపోవడం చెడు అలవాట్లకు బానిస కావడంతో వ్యాధులు కబళిస్తున్నాయి. ఆరోగ్య సూత్రం మీద అవగాహన లేని కారణంగా విచ్చలవిడిగా మాత్రలు మింగేస్తున్నారు. ప్రజలు ఉదయం భోజనం కంటే ముందే మందులు తీసుకోవాల్సి వస్తోంది. ఈ రకమైన మందులు వాడి వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తోంది.

ఆరోగ్య సూత్రాలు పాటించేవారు కరువు..

డొంకేశ్వర్ మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు సబ్‌సెంటర్లు ఉండగా.. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో రోజుకు 60 నుంచి 70 మందికి పైగా ఓపీలు వస్తుంటాయి. దీనికితోడు జిల్లాకేంద్రంతోపాటు ఇతర జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులలో బీపీ, షుగర్, తదితర దీర్ఘకాలిక వ్యాధులు చికిత్సలకు ఓపీకి వెళ్తుంటారు. ఇందులో అధికంగా థైరాయిడ్, బీపీ, మధుమేహం, అస్తమా వారే అధికంగా ఉంటారు. మండలవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రి మాత్రలు వాడేవారు బీపీ 346, షుగర్ 206, బీపీ, షుగర్ కలిపి వాడుతున్నవారు 172, ప్రైవేటు ఆసుపత్రి బీపీ మాత్రలు వాడుతున్న వారు 743, ప్రైవేటు ఆసుపత్రి షుగర్ వాడుతున్నవారు 276, షుగర్ బీపీ కలిపి ఉండి ప్రైవేటు ఆసుపత్రి మాత్రలు వాడుతున్న 216 మంది వాడుతున్నట్టు తెలిసింది. సుమారు 200 మంది పైగానే చికిత్సలు నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నట్లు సమాచారం. మనిషి నిత్యజీవితంలో ఆరోగ్య సూత్రాలు పాటించకపోతే దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కలిగించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రతీరోజు వ్యాయామం కాలినడక వంటివి చేసినట్లయితే దీర్ఘకాలం వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని చెప్తున్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

- విద్యాసాగర్, వైద్యులు, డొంకేశ్వర్



గతంలో షుగర్, బీపీ ఉన్న వారికి మూడు గదులు గల బ్యాగును అందించాం. నెలకు సరిపడా మందులను సిబ్బంది ఇంటికి వెళ్లి ఇచ్చివస్తారు. అందరికీ ఆరోగ్య సూత్రాలు తెలుసు కానీ పాటించే వారు కనీసం 2 శాతం మంది కూడా లేరు. చిన్న జాగ్రత్తతో ఎంతోమంది అనారోగ్యం పాలవుతున్నా రు. ఆరోగ్య నియమాలు పాటించకపోవడంతో జబ్బులను కొని తెచ్చుకోవాల్సిన దుస్థితి వస్తోంది. కచ్చితంగా ఆరోగ్య సూత్రాలు పాటించాలి. బయట ఆహారాన్ని అలవాటు పడకూడదు. డాక్టర్ సలహాలు, సూచనలు లేకుండా మాత్రలు వాడొద్దు.

రోజూ మాత్రలు వేసుకుంటా

- చిన్నక్క, నడ్కుడ



బీపీ, షుగర్ మాత్రలు ప్రతీరోజు వాడుతుంటా. నెలకు సరిపడా మందులను ప్రభుత్వ ఆసు పత్రి నుంచి అందిస్తారు. గోలిలు వేసుకుంటేనే ఆరోగ్యం నిలకడగా ఉంటుంది. ప్రతీరోజు కొద్దిసేపు వాకింగ్ చేస్తున్నాను.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

● జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ఎల్లారెడ్డి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ అరుణ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ మహిళా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు మహిళా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని మండలంలోని ప్రతీ గ్రామాల ల్లో బూత్ వార్డు, మండల కమిటీలు నిర్వహిస్తామన్నారు.కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు గుర్తు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ అరుణ, ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్‌పార్టీ మహిళా అధ్యక్షురాలు వాసవిగౌడ్‌కు ఎల్లారెడ్డి వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ మారెడ్డిరజిత వెంకటరాంరెడ్డి శాలువాతో సన్మానించారు.ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

దేవతల ఫొటోలు ముద్రించి ఉన్న టపాకాయలు విక్రయించొద్దు



బీర్కూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

బీర్కూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాలలో దేవి, దేవతల ఫొటోలు ముద్రించి ఉన్న టపాకాయలు విక్రయించకుండా తగు చర్యలు తీసుకోవాలని బీర్కూర్ గ్రామ యువకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన యువకులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని దేవి దేవతల ఫొటోలు ముద్రించి ఉన్న టపాకాయలు మార్కెట్‌లో విక్రయిస్తున్నారని తహసీల్దార్ లత దృష్టికి తీసుకువచ్చారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఆమెను కోరారు. ఈసందర్భంగా యువకులు మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకుని టపాకాయలు కాల్చడం జరుగుతుందన్నారు. అయితే టపాకాయలపై దేవి దేవతల ఫొటోలు ముద్రించినవి మార్కెట్‌లో విక్రయిస్తున్నారని దీంతో హిందువుల మనోభావాలు దెబ్బతింటున్నాయని అన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదివినప్పుడే మంచి పేరు

రామారెడ్డి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పట్టుదలతో చదివినప్పుడే మంచి పేరు లభిస్తుందని రామారెడ్డి ఎంఈవో నిట్టు ఆనంద్ రావు పేర్కొన్నారు. రామారెడ్డి మంలం పోసానిపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తరగతి గదిలో సోమవారం పీఎస్ అండ్‌హెచ్ డబ్ల్యూ వైట్ బోర్డును ఎంఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివకృష్ణ, రమేష్, కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యా యులు జ్యోత్స్న, దేవి, ప్రశాంత్, శ్రీనివాస్, సీఆర్‌పీ మహమూద్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ - పశు వైద్యశాల కార్యాలయం వద్ద అధ్వానం

● పెద్ద రోడ్డుపై నీరు నిలుస్తున్న పట్టించుకోని అధికారులు

రామారెడ్డి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్నరామారెడ్డి మండల కేంద్రం చాలా అధ్వాన్నంగా తయారైంది. గతంలో ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అధికారులు సైతం పరిస్థితులను చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రామారెడ్డి పోలీస్‌స్టేషన్ ఆవరణలో పక్కనే పశు వైద్యశాల లోపలికి వెళ్లే ముందు రోడ్డుపైనే నీరు ఆగుతూ అధ్వాన్నానికి గురవుతుంది. వాహనాలు పోలీస్‌స్టేషన్ ముందు పశు వైద్యశాల ముందు పక్కనే ఇంటర్నెట్ తదితర షాపుల ముందు, హోటల్, ప్రైవేట్ దుకాణాలు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముందు భారీ ఎత్తున వాహనాలు నిలిపివేయడంతో ప్రజలకు, వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులుగా మారుతున్నాయి. ఇప్పటికైనా గ్రామ ప్రత్యేక అధికారి, మండల ప్రత్యేక అధికారులు పట్టించుకుని పరిస్థితిని చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

రూ. 4016 జీవనభృతి కోసం భారీ ర్యాలీ

దోమకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది బీడీ కార్మికులు ఉన్నారని వారికి షరతులు లేకుండా రూ. 4016 జీవనభృతి చెల్లించాలని డిమాండ్ చేస్తూ దోమకొండ మండల కేంద్రంలో బీడీ కార్మికులు భారీ ర్యాలీ, తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు . లేనిచో స్థానిక ఎన్నికల్లో తగిన ముల్యాం చెల్లించుకోకతప్పదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్దిరాములు, అంజనేయులు,నాగరపు ఎల్లయ్య, వెంకట్‌లక్ష్మీ, లింగం, తదితరులు పాల్గొన్నారు.

చెత్తసేకరణ బండ్ల ప్రారంభం

కామారెడ్డి,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చెత్త సేకరణ బండ్లను మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. 76 బండ్లను ఆయా వార్డులలో చెత్త సేకరణ కోసం ప్రారంభించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అనుష,పట్టణ కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వచ్చే ప్రతీ దరఖాస్తును పరిశీలించి చర్యలు తీసుకోవాలి

● కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డిటౌన్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దరఖాస్తుదారులు, వారి సమస్యలపై రుణమాఫీ,భూ సమస్యలు, తదితర సమస్యలపై 64 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో రెవెన్యూ 27,వ్యవసాయశాఖ 9,పౌరసరాఫరాశాఖ 1,విద్యాశాఖ 1, జిల్లా వైద్యఆరోగ్యశాఖ 3, జిల్లా పంచాయతీ 10,రోడ్లు భవనాలు 1, విద్యుత్‌శాఖ 1, మున్సిపల్ 7, జిల్లా గ్రామీణాభివృద్ధి 1, సర్వే ల్యాండ్ రికార్డ్సు 2, జిల్లా సంక్షేమఅధికారి 1 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉన్న వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని, వాటికి సమాధానాలు దరఖాస్తుదారులకు ఇవ్వాలని తెలిపారు.గత వారం వరకు 18360 దరఖాస్తులు రాగా వాటిని పరిశీలించి 17752 దరఖాస్తులను ఆయాశాఖల అధికారులు పరిష్కరించారని, 608 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డీఓ రంగనాథ్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జడ్పీ సీఈవో చందర్‌నాయక్, డీపీఓ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● కలెక్టరేట్ డోర్‌కు వినతి పత్రం అందించి సీపీఎం నాయకుల నిరసన

కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికార్యక్రమానికి ఫిర్యాదుచేయడానికి వెళ్తే తమను జిల్లా కలెక్టర్ తమను అవమానపరిచారని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ మెయిన్ డోర్‌కు దరఖాస్తు ఉంచి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయని ఇప్పటికే అనేక సార్లు పరీక్షలు నిర్వహిస్తున్న ఆసుపత్రినిర్వహకుల మీద అనేక సార్లు కేసులు నమోదయ్యాయని అధికారులు ప్రతిసారి చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న ఇదేంటని ప్రశ్నించారు.ఈ విషయమైన కలెక్టర్‌కు వినతి పత్రం ఇద్దామంటే దగ్గరకు రావద్దు దూరం ఉండి మాట్లాడండి అంటూ వివక్ష చూపారని ఆరోపించారు. ప్రజావాణి కోచ్చే ప్రజల పట్ల ఆయన ప్రవర్తన సరిగ్గాలేదని రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైన కలెక్టర్‌పై విచారణ జరపాలని కోరుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని బలోపేతం చేయాలి

● నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్

మద్నూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి మద్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని బలోపేతం చేయడానికి ప్రతీ రైతు ఇందులో సభ్యత్వం తీసుకోవాలని నాబార్డు డీడీఎం ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘంలో శనగ విత్తనాల బస్తాలను రైతులకు విక్రయించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంలో 25 కిలోల శనగ విత్తనాల బస్తాను రూ.2200కు అందజేస్తున్నట్లు వెల్లడించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులను అందజేస్తుందని రైతులు ఇందులో చేరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మద్నూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు ఎనిమిది వందల బస్తాల విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సభ్యులకే కాకుండా పత్తి రైతుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందజేయడం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం ఛైర్మన్ చాట్ల గోపాల్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న డీడీఎం

హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



రైతు పోరు యాత్రలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బీబీ పాటిల్



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎంపీ బీబీ పాటిల్

● నాగిరెడ్డిపేట రైతు పోరు యాత్రలో మాజీ ఎంపీ బీబీ పాటిల్

నాగిరెడ్డిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆరోపించారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు పోరు యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతు పోరు యాత్రను నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్ళు ప్రారంభించాలని, సన్న వడ్లతో పాటు దొడ్డు రకం వడ్లకు సైతం 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని, ప్రస్తుతం పూర్తయిన ఖరీఫ్ పంటకు రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని,ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతు పోరు యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు పోరు యాత్రలో మాజీ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలనుకాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక ఇచ్చిన హామలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసే విషయంలోనూ రైతు భరోసా ఇవ్వడంలోనూ, వ్యవసాయ కూలీలకు 12 వేల రూపాయలు ఇవ్వడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతులకు, ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నిటినీ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ళు జరడం లేదని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. అకాల వర్షాలు కురిసి ధాన్యం తడిసి రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం వెంటనే కొనుగోళ్ళను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. రైతులకు ఏ సమస్య వచ్చినా బీజేపీ పార్టీ రైతులకు అండగా నిలుస్తుందని ఆయన హామీనిచ్చారు. రైతుల పక్షాన నిలబడి రైతుల కోసం పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారి గుండా ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. రైతు పోరు యాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరుగకుండా ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై మల్లారెడ్డి గట్టి పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, జిల్లా బీజేపీ నాయకులు రాజ్‌మోహన్‌రెడ్డి, హన్మాండ్లు, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌గౌడ్, దేవిసింగ్, మండల బీజేపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

తాడ్వాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన విద్యార్థి శ్రీకర్ యాదవ్ స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ అండర్ -17 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని గ్రామస్తులు తెలిపారు. ఇటీవల నిజామాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి సెలక్షన్ లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగిందన్నారు. ఈనెల 27 నుంచి 30 వరకు పెద్దపల్లి జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో పోటీల్లో నిజామాబాద్ టీమ్ తీరపున ప్రాతినిధ్యం వహిస్తారు. విద్యార్థిని గ్రామస్తులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో అభినందించారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో బాగైన రోడ్డు

సదాశివనగర్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):సదాశివనగర్ మండలంలోని కన్కల్ గ్రామాల మధ్య గత ఐదు రోజుల క్రితం రోడ్డు ధ్వంసం చేసిన విషయం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహర్‌రావు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు.ఎమ్మెల్యే అనుమతితో రోడ్డు సరిచేయడం జరిగిందని గ్రామ అధ్యక్షుడు కనకంటి భాస్కర్ తెలిపారు. రోడ్డు ధ్వంసం చేసిన విషయమై తెలిసిన ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి రోడ్డుసరిచేయడం కాకుండా త్వరలో బీటీవేసి ఇరుగ్రామాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులకు తెలిపారు.

కామారెడ్డి జిల్లా వాసికి హైదరాబాదులో సత్కారం

సదాశివనగర్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): భారతీయ కళాసంస్కృతి 8వ వార్షికోత్సవ కార్యక్రమంలో హైదరాబాద్‌లోని ఫీనిక్స్ అరేనా(మాదాపూర్)లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ ఆర్ట్స్, నృత్యం, సంగీతంలో రాష్ట్రస్థాయిలో డిస్టింక్షన్ సాధించినసన్మానించారు

గంధపు చెట్లను దొంగిలించిన దొంగలు

తాడ్వాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన అకిటి శ్రీకాంత్‌రెడ్డికి చెందిన సుమారు లక్ష రూపాయల విలువ చేసే గంధంపు చెట్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు వ్యవసాయ బావి వద్ద నుంచి చెట్లను చిన్న చిన్న తుంగలు చేసి ఎత్తుకెళ్లారని రైతు ఆవేదన వ్యక్తంచేశారు. గత నాలుగు సంవత్సరాల క్రితం తనవ్యవసాయ క్షేత్రంలో సుమారు 10 గంధపు చెట్లను పెంచుతున్నట్లు ఆయన తెలిపారు. రాత్రి ఎవరూ లేని సమయంలో దొంగలు ఎత్తుకెళ్లారని రైతు అన్నాడు. వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని తెలిపారు.

సుల్తాన్‌పేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం

మద్నూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సుల్తాన్‌పేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. అందులో భాగంగా డోంగ్లి సొసైటీ ఆధ్వర్యంలో సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిం చినట్లు డైరెక్టర్ బస్సీ పటేల్ తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో మోహీన్ పటేల్, సంతోష్, ఏఈవో గౌడ్, సొసైటీ డైరెక్టర్లు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఎంఈవో కి వీడ్కోలు

రాజంపేట,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):రాజంపేట మండల కేంద్రంలోని మం డల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం బదిలీపై వెళ్లిన ఎంఈవో రామస్వామికి వీడ్కోలు సమావేశం నిర్వహించినట్లు ఎంఈవో నూతన ఎంఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈశ్వర య్య, ఏఈ,ఆర్‌పీసీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి కాదు.. ఇష్టపడి చదవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి షేక్‌సలాం

గాంధారి,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివేకన్న ఇష్టపడి చదవాలని అప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ గడ్డం గంగారాం అధ్యక్షతన జరిగిన తల్లిదండ్రులు,అధ్యాపకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజుకళాశాలకు పంపించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధిస్తున్నారని అన్నారు. పలువురు విద్యార్థులు కళాశాలకు రావడానికి ఎదుర్కోంటున్న సమస్యలను వివరించారు.ఈసమావేశంలో అధ్యాపకులు రాజగోపాల్, లక్ష్మన్,శ్రీధర్, విజయ్‌కుమార్, రమేష్, వెంకటస్వామి, సరిత,సుజాత, స్వప్న, రాజ్‌కుమార్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

కులగణనకు కసరత్తు

(5వ పేజీ తరువాయి...)

వివరాలు సేకరించనున్నట్లు తెలిసింది. కుటుంబ యాజమాని నుంచి మొదలుకొని అతనికి సంబంధం ఉన్న వారి కులం, ఉపకులం,మతృభాష, విద్య,ఆస్తుల వివరాలు, రిజర్వేషన్‌ల ద్వారా లబ్ధిపొందిన వివరాలు ఇలా అనేక వివరాలను సేకరించనున్నారు.దీనిపై అధికారులకు మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు.

'విచారణ కొనసాగుతోంది'

(5వ పేజీ తరువాయి...)

కేసు నమోదు చేశామని బెయిల్‌పై విడుదలైన తర్వాత నిర్వహకుడు ఇట్టెం సిద్ధిరాములు మరో ఆసుపత్రి తెరిచాడని, గత ఆరునెలల కిందట ఆ ఆసుపత్రిలో సైతం లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నాడని సమాచారంతో ఆ ఆసుపత్రిని సీజ్‌చేశామని అప్పుడు కోర్టు ద్వారా స్టే తీసుకుని వచ్చి ఆసుపత్రిని కొనసాగిస్తున్నాడని తెలిపారు.ఈనెల 25 న పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి అశోక్‌నగర్ రైల్వే గేటు వద్ద ఓ వాహనంలో స్కానింగ్ మిషన్‌లుఉన్నాయని సమాచారం ఇవ్వడంతో తమ సిబ్బందితో కలిసి పరిశీలన చేయగా లింగనిర్ధారణకు ఉపయోగించే స్కానింగ్ మిషన్ ఇట్టెం సిద్ధిరాములు కారులో దొరికిందని తెలిపారు.అక్కడి నుంచి కౌసల్య ఆసుపత్రిలో తనిఖీలుచేసేందుకు వెళ్లగా అక్కడ సైతం మరో స్కానింగ్ మిషన్ ఉందని రెండు స్కానింగ్ మిషన్‌లను కామారెడ్డి ఆర్‌డీఓ సమక్షంలో సీజ్‌చేశామని తెలిపారు. శనివారం కోర్టులో సైతం పీసీపీఎన్‌డీటీ యాక్ట్ ప్రకారం కోర్టులో కేసు నమోదుచేశామని తెలిపారు. జిల్లాలో లింగనిర్ధారణ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం అధికారి సుమిత్రనాయక్, డిప్యూటి డీయంహెచ్‌వో ప్రభుదయాకిరణ్, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్వాపూర్ విండో ఛైర్మన్ బాధ్యతల స్వీకరణ



విండో ఛైర్మన్‌గా స్వామి బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

భిక్కనూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు బస్వాపూర్ విండో ఛైర్మన్‌గా గ్రామానికి చెందిన మద్ది స్వామి సోమవారం విండో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సహకార అధికారులు బస్వాపూర్ విండో నుంచి కాచాపూర్ విండోను ప్రత్యేక విండోగా ఏర్పాటు చేసి పాలక వర్గాన్ని రద్దు చేశారు. అనంతరం రెండు విండోలకు అధికారులు పర్సన్ ఇన్‌చార్జిలను నియమించగా విండో డైరెక్టర్లు హైకోర్టును ఆశ్రయించారు. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు పర్సన్ ఇన్‌చార్జిల నియామకం చెల్లదని, విండో ఉపాధ్యక్షుడు మద్ది స్వామిని ఇన్‌చార్జి ఛైర్మన్‌గా నియమించాలని ఆదేశాలు జారిచేసింది. ఈ మేరకు స్వామి బాధ్యతలు స్వీకరించారు. కాగా బాధ్యతలు స్వీకరించిన స్వామికి విండో సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

భిక్కనూరు బంద్ విజయవంతం



భిక్కనూరులో దుకాణాలు మూసివేసిన దృశ్యం

భిక్కనూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): హిందుదేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసిస్తూ భిక్కనూరు హిందుసంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బంద్ కార్యక్ర మం విజయవంతమైంది. ఉదయం నుండే కార్యాలయాలు, పాఠశాలలను స్వచ్ఛందంగా మూసివేశారు. ఈ సందర్భంగా హిందు సంఘాల ప్రతినిధులు మండలకేంద్రంలోని పాత 44వ జాతీయరహదారి సినిమా టాకీసు చౌరస్తా వద్ద రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ హిందు దేవాలయాలపై దాడులు చేసిన వారిని బహిరంగంగా ఉరి తీయాలని, ఇకపై హిందు దేవాలయాలపై దాడు చేస్తే సహించబోమని హెచ్చరించారు. కాగాబంద్‌కు ఆటోయూనియన్ సభ్యులు పూర్తి మద్దతు తెలిపి ఆటోలను నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో హిందు సం ఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

బీర్కూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన అనిత అనే వివాహిత గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుంది. అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న అనిత జీవితంపై విరక్తి చెందింది. సో మవారం బీర్కూర్ గ్రామ సమీపంలోని భాజన్ చెరువు వద్దకు చేరుకుంది. అనంతరం చెరువులో దూకి ఆత్మహత్య ప్రయత్నం చేసింది. చెరువు దగ్గర ఉన్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని అనితను రక్షించారు. నారోగ్య సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని తెలిపింది. పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి ఆమెను ఇంటికి చేర్చారు.

టీఈజీజేఏసీ కామారెడ్డి జిల్లా స్టీరింగ్ కమిటీ ఏర్పాటు

కామారెడ్డిటౌన్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):టీఈజీజేఏసీ కామారెడ్డి స్టీరింగ్ కమిటిని సోమవారం ఏర్పాటుచేశారు. జిల్లా ఛైర్మన్‌గా వెంకట్‌రెడ్డి, సెక్రటరీగా డాక్టర్ దేవేందర్, అడిషనల్ సెక్రటరీ కుశాల్‌కో ఛైర్మన్‌గా అనిల్‌కుమార్,సాయిలు, ప్రేమ్‌కుమార్,హనుమంత్‌రెడ్డి, రాజు,ముజిబోద్దిన్, నిజాం, దేవుల, విటల్‌రావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌బి. సాయిలు, సాయిరెడ్డి,ఎల్లారెడ్డి, వైస్ ఛైర్మన్‌గా పూర్ణచందర్, ఎండీ బషీర్, అంబీర్‌మనోహర్‌రావు, ఫైనాన్స్ సెక్రటరీగా చక్రధర్,పబ్లిసిటి సెక్రటరిగా ఎస్.భూమయ్యలతో కమిటిని ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు ఐదు డీఏలు ఇవ్వాల్సి ఉండగా ఒక్క ఇవ్వడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయులలో తీవ్ర అసంతృప్తి ఉన్నది కావున ప్రభుత్వం పునర్‌పరిశీలించాలని ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన ఐదు డీఏలను విడుదల చేయాలని, పెండింగ్ బిల్స్ విడుదల చేయాలని కామారెడ్డి జిల్లా జేఏసీ స్టీరింగ్ కమిటి తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- దేవర
దర్శన్	- ద లాస్ట్ డ్యాన్స్ పొట్టేల్
ప్రియా 35	- విశ్వం
ప్రియా 70	- లగ్గం

బాన్సువాడ

మహేశ్వరి	- వేట్టయన్ (ది హంటర్)
వెంకటేశ్వర	- విశ్వం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

